
సాక్షి
గుంటూరు

బుధవారం । 15 । ఫిబ్రవరి । 2023

I



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టు ప్రస్తుత నీటి నిల్వ 42.9635 టీఎంసీలు. ఎగువ నుంచి 6,709 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది. దిగువకు 2200 క్యూసెక్కులు వదులుతున్నారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్: కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 2,423 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 1179 క్యూసెక్కులు విడుదలయ్యాయి.

కరోనా జీరో



గుంటూరు మెడికల్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం కరోనా పాజిటివ్ కేసు ఒక్కటి కూడా నమోదు లేదు. జిల్లాలో ఎక్కడా కరోనా మరణాలు సంభవించలేదు.

న్యూస్‌రీల్

భృంగి వాహనంపై ఊరేగిన మల్లేశ్వరుడు



మంగళగిరి: నగరంలో వేంచేసిఉన్న గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఐదవ రోజు మంగళవారం స్వామి వారు భృంగి వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆయా కూడళ్లలో భక్తులు మల్లేశ్వరుని దర్శించుకుని హారతులిచ్చారు. దేవస్థానం వద్ద నుంచి ప్రారంభమైన స్వామి వారి గ్రామోత్సవం మెయిన్ బజారు మీదుగా శాసన స్తంభం, పూలమార్కెట్ మీదుగా మిద్దె సెంటర్‌కు చేరుకుంది. అనంతరం అక్కడి నుంచి పెద కోనేరు మీదుగా తిరిగి దేవస్థానానికి చేరింది. నగరానికి చెందిన మాజేటి సూర్యవేణుగోపాలకృష్ణ, కృష్ణకుమారి దంపతులు, ఎల్‌కే శర్మ, ఇందిరాదేవి దంపతులు భృంగి వాహన ఉత్సవానికి కై ంకర్యపరులుగా వ్యవహరించగా దేవస్థాన ఈఓ అన్నపురెడ్డి రామకోటిరెడ్డి పర్యవేక్షించారు.

వరికపూడిసెల నిర్మాణానికి సహకరించండి

పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు



నరసరావుపేట: ఏడు దశాబ్దాల పల్నాడు వాసుల కల, అతిపెద్ద నీటి ప్రాజెక్టు వరికపూడిసెల లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ నిర్మాణానికి సహకరించి కావాల్సిన అనుమతులు జారీ చేయాలని కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖలో ఏడీజీ (అడిషనల్ డైరెక్టర్ జనరల్) బివాష్‌రంజన్‌ను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అభ్యర్థించారు. మంగళవారం ఢిల్లీలో బివాష్ రంజన్‌ను ఎంపీ కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి క్లియరెన్స్‌లు పొందడానికి అవసరమైన డీపీఆర్ సహా అన్నీ ప్రక్రియలను పూర్తి చేసిన నివేదికలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి సమర్పించినట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టులో ముఖ్య భాగాలైన పంప్‌హౌస్, ప్రెజర్ మెయిన్, బ్రేక్ ప్రెజర్ ట్యాంక్, ఇతర నిర్మాణాలు చేపట్టడానికి కావాల్సిన భూమి అటవీ ప్రాంతంలో ఉందన్నారు. ఇది రాజీవ్ గాంధీ వన్యప్రాణుల అభయారణ్యం, నాగార్జునసాగర్ శ్రీశైలం పులుల అభయారణ్యంలోని ప్రధాన ప్రాంతమని వెల్లడించారు. 19.13 హెక్టార్ల భూమి మళ్లింపును వేగవంతం చేయాలని విన్నవించారు. జిల్లాలోని వెల్దుర్తి మండలం గంగులకుంట గ్రామం సమీపంలో ఈ ప్రాజెక్టు నిర్మించాల్సిఉందని, ఈ ప్రాజెక్టు పూర్తయితే భారీ ఎత్తున సాగు, తాగునీటి సమస్య తీరుతుందని విజ్ఞప్తి చేశారు.

18న ఏలేశ్వరస్వామి గుట్టకు లాంచీ సర్వీసులు

పర్యాటక శాఖ మేనేజర్ భైరవస్వామి



విజయపురిసౌత్: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 18వ తేదీ ఏపీ పర్యాటకశాఖ ఆధ్వర్యంలో అనుపు నుంచి ఏలేశ్వరస్వామి గుట్ట (మల్లయ్య గట్టు)కు ప్రత్యేక లాంచీ సర్వీసు తిప్పేందుకు ఏర్పాట్లు చేసినట్లు స్థానిక లాంచీస్టేషన్ మేనేజర్ భైరవస్వామి మంగళవారం తెలిపారు. ఆయన మంగళవారం విలేకరలతో మాట్లాడుతూ ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు లాంచీ సర్వీసులు అనుపు నుంచి అందుబాటులో ఉంటాయన్నారు. అనుపు నుంచి ఏలేశ్వరగట్టుకు వెళ్లేందుకు పెద్దలకు రూ.200, పిల్లలకు రూ.150 టిక్కెట్ ధరను నిర్ణయించినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే అనుపులో అన్ని ఏర్పాట్లను చేశామని తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం ఫోన్ నంబర్ 97051 88311ను సంప్రదించాలన్నారు. ఆయన వెంట వినయతుల్లా, సిబ్బంది ఉన్నారు.



దిగుబడులు తగ్గినా మిర్చి రైతుకు ‘గిట్టుబాటు’ ధర	బాడిగి రకం క్వింటాకు రూ.25 వేలు.. 334 రకం రూ.23 వేలు	ఈ ఏడాది రూ.7,000 నుంచి రూ.25,000
	గత ఏడాది సగటు ధర రూ.రూ.7,000 నుంచి రూ.15,000	

ఎర్ర బంగారం మిలమిల

సాక్షి ప్రతినిధి, గుంటూరు: ఈ ఏడాది ధరలు ఆశాజనకంగా ఉండడంతో మిరప రైతులు ఊరట చెందుతున్నారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లో మిర్చి సాధారణ సాగు విస్తీర్ణం 78 వేల హెక్టార్లు కాగా.. ఈ ఏడాది అత్యధికంగా 84,861 హెక్టార్లలో సాగయింది.

మిర్చి వైపు మొగ్గు

గడచిన రెండేళ్లుగా మిర్చికి మెరుగైన ధర వస్తుండడంతో ఈ ఏడాది రైతులు భారీగా మిర్చి సాగు వైపు మొగ్గు చూపారు. గత ఏడాది 74 వేల హెక్టార్లలో సాగైన మిర్చి ఈ ఏడాది ఏకంగా 84,861 హెక్టార్లకు చేరింది. గత ఏడాది తామర పురుగుతో మిర్చి పంట బాగా దెబ్బతింది. కానీ ఈ ఏడాది తెగుళ్ల కొంత మేర కంట్రోలు కావడం, దిగుబడులు కూడా గత ఏడాది కంటే మెరుగ్గా ఉండటం, ఆశించిన మేర ధరలు ఉండటంతో రైతులు అమ్ముకునేందుకు ముందుకొస్తున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఫిబ్రవరి మాసంలో ఈ ధరలు ఉండటం అన్నదాతలకు కలిసివస్తోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో మన మిర్చికి డిమాండ్ ఉండటంతో ఎగుమతి వ్యాపారులు మిర్చి కొనుగోలుకు పెద్ద ఎత్తున ఆసక్తి చూపుతున్నారు. కారం తయారీకి అధికంగా ఉపయోగించే 341, దేవనూరు డీలక్స్, 334 రకాల మిర్చి క్వింటా రూ.23 వేలకు పైగా ధర పలుకుతోంది. కారం తయారు చేసి దేశీయంగా విక్రయించడంతో పాటు విదేశాలకు ఎగుమతి చేసే బహుళజాతి కంపెనీలు పెద్ద ఎత్తున మిర్చి కొనుగోలు చేస్తున్నాయి. గుంటూరు మిర్చి యార్డుకు రోజువారీగా సగటున లక్ష బస్తాలకు పైగా మిర్చి వస్తుండగా, అదేస్థాయిలో అమ్మకాలు జరుగుతున్నాయి. ఇదే పరిస్థితి ఏప్రిల్ మాసం చివరి వరకు కొనసాగుతుందని, సరుకు లభ్యత పెరిగితే అందుకు అనుగుణంగా ధరలు కొనసాగుతాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. విదేశాలకు ఎగుమతి అయ్యే తేజ రకం మిర్చికి డిమాండ్ ఉంటుందనే అంచనాతో నిల్వ చేస్తున్నట్లు సమాచారం.

జాతీయ మార్కెట్‌లో డిమాండ్..

ప్రస్తుతం మిర్చికి మార్కెట్‌లో డిమాండ్ పెరుగుతోంది. ప్రధానంగా కోల్‌కతా, లక్నో, న్యూఢిల్లీ, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తదితర ప్రాంతాలకు మిర్చి ఎగుమతి చేస్తున్నారు. ఆయా రాష్ట్రాల్లో మిర్చి పంట తక్కువగా ఉండటం, ఎక్కువ ధర పలుకుతుండటంతో ఇక్కడి వ్యాపారులు రవాణా, పన్నులు, కమీషన్ తదితర ఖర్చులు చూసుకుని కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఇటు రైతులకు మెరుగైన ధర లభిస్తుండగా.. వ్యాపారులు సైతం లాభాలు గడిస్తున్నారు. తేజ రకం మిర్చి బంగ్లాదేశ్, శ్రీలంక దేశాలకు ఎగుమతి చేస్తున్నారు. సింగపూర్, మలేషియా దేశాలకు బాడిగి రకం మిర్చి ఎగుమతి అవుతోంది.

ఆకర్షిస్తున్న ధరలు

ప్రస్తుతం గుంటూరు మిర్చి యార్డులో నాన్ ఏసీ కామన్ రకం 341 క్వింటాల్‌కు రూ.22,500, 334కు రూ.23,000, సూపర్-10కు రూ.19,500, దేవనూరు డీలక్స్‌కు రూ.21,000 పలుకుతోంది. ప్రత్యేక రకాలైన తేజకు రూ.19,500, బాడిగికి రూ.25,000 ధర లభిస్తోంది. మిగిలిన రకాలకు రూ.7,000 నుంచి రూ.18,000 పలుకుతోంది. తాలు మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర వస్తోంది.

దిగుబడి బాగా వచ్చింది



ఎకరం పొలంలో మిరప వేశాను. ఈ ఏడాది తామర తెగుళ్ల వచ్చినా ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా తెగుళ్ల బారినుండి రక్షణ పొందాను. దిగుబడి 22 క్వింటాళ్ల వరకు వస్తుంది. క్వింటాధర ప్రస్తుతం సుమారు రూ. 17నుండి 18వేల వరకు ఉంది. పెట్టుబడిపోను మిగులుతుంది.

– ఎం.లక్ష్మారెడ్డి, రైతు, తాళ్లూరు, ఫిరంగిపురం మండలం)

10 వేల కోట్ల వ్యాపారమే లక్ష్యం

గుంటూరు మార్కెట్ యార్డులో గతేడాది రూ.8,500 కోట్ల వ్యాపారం జరిగింది. దీంతో యార్డుకు సెస్సు రూపంలో రూ.85 కోట్ల ఆదాయం లభించింది. ఈ ఏడాది రూ.10 వేల కోట్ల వ్యాపారం జరుగుతుందని అంచనా. యార్డుకు సెస్సు రూపంలో రూ.100 కోట్లు ఆదాయం సమకూరనుంది. గతంలో ఎన్నడూ లేనివిధంగా మిర్చి ధరలు ఆశాజనకంగా ఉండడంతో మార్కెట్ యార్డుకు భారీ స్థాయిలో మిర్చి వస్తోంది.

– చంద్రగిరి ఏసురత్నం, మిర్చియార్డ్ చైర్మన్

ఎకరాకు తొలికాపు 30 క్వింటాళ్లు

రెండెకరాల్లో మిర్చి సాగు చేశాను. తొలి కాపు 30 క్వింటాళ్ల దాకా దిగుబడి వచ్చింది. క్వింటా రూ.29,500కు అమ్మాను. ఇప్పుడు రెండవ కోత కోయిస్తున్నాను. గతేడాది వైఎస్సార్ జలసిరి కింద బోరు వేయడంతో అందులో తొలిసారి మిర్చి సాగు చేసి సక్సెస్ అయ్యాను.

– ఉల్లేరు ఆదినారాయణ, కౌలు రైతు, కారెంపూడి, పల్నాడు జిల్లా

మంచి ధర..



రెండెకరాల్లో మిర్చి సాగు చేస్తున్నా. తొలి కాపు దిగుబడి 25 క్వింటాళ్ల దాకా వచ్చింది. క్వింటా రూ.20 వేల చొప్పున అమ్మాను. మళ్లీ రెండో కోత కోయాల్సి ఉంది. అవి కూడా 25 కింటాళ్ల అవుతాయని అనుకుంటున్నాను. ప్రస్తుతం మంచి ధర ఉండడం సంతోషంగా ఉంది.

–పాలువాయి వెంకటేశ్వరరెడ్డి, రైతు, రెడ్డిపాలెం, కారెంపూడి మండలం

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

- ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు
- జిల్లా స్థాయి విద్యా-వైజ్ఞానిక ప్రదర్శన ప్రారంభం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించుకుని భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు పేర్కొన్నారు. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అరండల్‌పేటలోని సెయింట్ ఇగ్నేషియస్ ఎయిడెడ్ బాలికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి విద్యా-వైజ్ఞానిక ప్రదర్శన-2023ను ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి ప్రారంభించారు.

పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలి

తాడికొండ ఎమ్మెల్యే డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. రాజకీయంగా ఏ పదవిలో ఉన్నా, ఒక వైద్యురాలిగా తనకు గుర్తింపు ఉందని, వైద్య విద్య అభ్యసించడం ద్వారా పెంచుకున్న విజ్ఞానం జీవితాంతం అనుభవంలో ఉంటుందన్నారు. విద్యార్థులు తమకు ఇష్టమైన రంగంలో రాణించాలని సూచించారు. ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థులు పరిశోధనలపై ఆసక్తిని పెంచుకుని నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలని సూచించారు. డీఈవో పి.శైలజ మాట్లాడుతూ జిల్లాలోని 17 మండలాల పరిధిలో మండలానికి ఐదు చొప్పున ఎంపిక చేసిన 85 ప్రాజెక్టులను రెండు రోజుల పాటు జరిగే జిల్లా స్థాయి ప్రదర్శనలో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. వీటిలో న్యాయనిర్ణేతల ద్వారా 10 ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి ఈ నెల 27, 28వ తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి ప్రదర్శనకు పంపుతామని చెప్పారు.

ప్రాజెక్టులను తిలకించిన కలెక్టర్

జిల్లా స్థాయి ప్రదర్శనను కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి సందర్శించారు. విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఆర్డీవో ప్రభాకరరెడ్డి, సమగ్రశిక్ష ఏపీసీ జి.విజయలక్ష్మి, డీవైఈవో కె.సుధాకర్‌రెడ్డి, ఎంఈవో అబ్దుల్ ఖుద్దూస్, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసీం, జిల్లా సైన్స్ అధికారి రాయపాటి శివనాగేశ్వరరావు, హెచ్‌ఎం సిస్టర్ మరియరాణి పాల్గొన్నారు.

సృజనకు పదును పెట్టిన విద్యార్థులు

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులు వివిధ సామాజిక సమస్యలకు పరిష్కారం చూపే విధంగా ఉన్నాయి.

ప్రాజెక్టు పేరు: మల్టీపర్పస్ అగ్రికల్చర్ మెషీన్



వట్టిచెరుకూరు మండలం ముట్లూరు జెడ్పీ హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థిని నాగూర్‌బీ గైడ్ టీచర్ వీఎస్ రామాంజనేయులు సహకారంతో ఈ ప్రాజెక్ట్ రూపొందించింది. భూమిని దున్ని, విత్తనాలు నాటడంతో పంటకు నీరు పెట్టడం, కోత కోయడం వంటి పనులన్నింటినీ ఒకే యంత్రం చేయడం ప్రాజెక్టులోని ముఖ్యాంశం. తక్కువ ఖర్చుతో రైతన్నలకు ఎన్నో ప్రయోజనాలు చేకూరుస్తుందని విద్యార్థిని చెబుతోంది.

ప్రాజెక్టు పేరు: స్మార్ట్ బేబీ ఫ్రెండ్లీ క్రేడల్



ముట్లూరు జెడ్పీ హైస్కూల్ 8వ తరగతి విద్యార్థిని ఎస్.రిషిత రూపొందించిన ఈ నమూనా ప్రాజెక్టు ద్వారా పసిపిల్లలను మనిషి ప్రమేయం లేకుండా ఊయల ఊపే పద్ధతిని ప్రయోగాత్మకంగా చూపారు. దీనికి ఒక సాంకేతిక పరికరాన్ని అమర్చి, టైం మోడ్, అలారం వంటి ఎన్నో సదుపాయాలను ఇందులో పొందుపర్చారు.

ఘనంగా ధ్యానబుద్ధవనం ప్రారంభోత్సవం

అమరావతి: బుద్ధిస్ట్ సర్క్యూట్‌లో భాగంగా స్వదేశీ దర్శన్ కార్యక్రమంలో భాగంగా అమరావతిలో నిర్మించిన ధ్యానబుద్ధవనాన్ని మంగళవారం కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా ప్రారంభించారు. తొలుత కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి ఆర్కే రోజా అమరేశ్వరాలయాన్ని సందర్శించారు. మంత్రులకు స్థానిక శాసన సభ్యుడు నంబూరు శంకరరావు స్వాగతం పలికి దేవాలయంలోకి ఆహ్వానించారు. మంత్రులిద్దరూ అమరేశ్వరునికి అభిషేకాలు, బాలచాముండేశ్వరీదేవి అమ్మవారికి కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రులకు ఆలయ అర్చకులు, వేదపండితులు ఆశీర్వచనం అందించి స్వామివారి శేషవస్త్రం, చిత్రపటంతో పాటుగా తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ధ్యానబుద్ధ విగ్రహం వద్ద బుద్ధుడి విగ్రహానికి పూజలు చేసి ధ్యాన బుద్ధవనంలో ఆడిటోరియం, ధ్యాన మందిరం, లేజర్ షో, ఫుడ్ కోర్టుతో పాటుగా ఇంటర్‌ప్రిడిక్షన్ సెంటర్‌ను రిబ్బన్ కత్తిరించి ప్రారంభించారు. తామ్ర ఫలకాన్ని ఆవిష్కరించారు. ధ్యానబుద్ధవనం ఆవరణలో రావి మొక్కను నాటారు. ఆ తర్వాత కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి స్థానిక పురావస్తు సంగ్రహనశాలను సందర్శించి అక్కడ బౌద్ధమత విశిష్టతను తెలిపే శిల్పాలను తిలకించారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ, ఏఎస్ఐ అధికారులు, స్థానిక వైఎస్సార్ సీపీ, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



రావి మొక్కను నాటుతున్న కేంద్ర, రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రులు జి.కిషన్‌రెడ్డి, ఆర్కే రోజా, ఎమ్మెల్యే శంకరరావు

కాలచక్ర మ్యూజియంను సందర్శించిన కలెక్టర్

అమరావతి: అమరావతిలోని కాల చక్ర మ్యూజియంను పల్నాడు జిల్లా కలెక్టర్ ఎల్ శివశంకర్ మంగళవారం సందర్శించారు. మ్యూజియంలోని అన్ని విభాగాలను, పరిసర ప్రాంతాలను పరిశీలించారు. మ్యూజియం మూతపడటానికి కారణాలు, తిరిగి వినియోగంలోకి తేవాలంటే తీసుకోవాల్సిన చర్యలపై పర్యాటకశాఖ సాంకేతిక అధికారులతో చర్చించారు. మ్యూజియం ఆవరణలో మద్యం దుకాణం ఉండటాన్ని గుర్తించిన కలెక్టర్ ఎక్సైజ్ ఉన్నతాధికారులతో మాట్లాడి దుకాణాన్ని వేరే చోటికి మార్చటానికి కృషి చేస్తానన్నారు. మ్యూజియంను యాత్రికులు సందర్శించే విధంగా తయారుచేయటానికి తీసుకోవాల్సిన చర్యలపై రాష్ట్ర మ్యూజియం డైరెక్టర్ వాణీమోహన్‌తో చర్చిస్తామన్నారు. మరో రెండు వారాలలో పర్యాటకశాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట పర్యాటకశాఖ ఈఈ శ్రీనివాసరావు తదితర అధికారులు పాల్గొన్నారు.

ఆపాదమస్తకం.. పుస్తకం

- సాహితీ సుగంధాలు వెదజల్లుతున్న విజయవాడ పుస్తక మహోత్సవం
- మోదీ 20 ఏళ్లు సృష్టించారు.. సాధించారు పుస్తకావిష్కరణ
- ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- దేశాన్ని ఆర్థికశక్తిగా తీర్చిదిద్దిన ఘనత మోదీదేనని ఉద్ఘాటన



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీ ప్రకాష్ జవదేకర్, ఏపీ బీజేపీ ఇన్‌చార్జి సునీల్ దేవధర్, ఏపీ బీజేపీ అధ్యక్షుడు సోము వీర్రాజు, ఐవైఆర్ కృష్ణారావు తదితరులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విజయవాడ పుస్తక మహోత్సవం సాహితీ ప్రియులకు మరపురాని అనుభూతులను మిగిల్చుతోంది. సాయం సంధ్యా వేళలో వేల సంఖ్యలో కొలువుదీరిన పుస్తక నేస్తాలు ఆహ్వానం పలుకుతుండగా.. రోజూ పలు వేదికలపై జరుగుతున్న సాహితీ చర్చలు, పుస్తకావిష్కరణలు ఉత్సాహాన్ని నింపుతున్నాయి.

ఆర్థిక శక్తిగా భారత్..

కరోనా వంటి సంక్షోభాలు వెంటాడుతున్నా దేశాన్ని ప్రపంచంలో ఐదో పెద్ద ఆర్థికశక్తిగా తీర్చిదిద్దిన ఘనత ప్రధాని నరేంద్రమోదీదేనని కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఎమెస్కో పబ్లిషర్స్ అనువాద ముద్రణ 'మోదీ 20 ఏళ్లు సృష్టించారు.. సాధించారు' పుస్తకావిష్కరణ కార్యక్రమం 33వ విజయవాడ పుస్తక మహోత్సవ ప్రాంగణంలోని గొల్లపూడి మారుతీరావు సాహితీవేదికపై మంగళవారం రాత్రి జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి కిషన్‌రెడ్డి మాజీ మంత్రి ప్రకాష్ జవదేకర్‌తో కలిసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కరోనా తాకిడికి చైనా, అమెరికా, యూకే, సింగపూర్ వంటి దేశాలు దారుణంగా ప్రభావితమయ్యాయన్నారు. కానీ యూకే వంటి అభివృద్ధి చెందిన దేశాన్ని పక్కకు నెట్టి భారతదేశం ఐదో పెద్ద ఆర్థికశక్తిగా ఎదగటంలో నరేంద్రమోదీ నాయకత్వ పటిమ దాగుందని అన్నారు. ప్రతి రోజూ సవాళ్లు ఎదురవుతున్నా అద్భుతమైన పరిపాలనను అందిస్తున్న మోదీ నాయకత్వం దేశానికి మరింత అవసరమన్నారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత మతకలహాలు, కర్ఫ్యూ, ఉగ్రవాద దుశ్చర్యలు వంటి పరిస్థితులు ఎక్కడా లేవన్నారు. మోదీ నాయకత్వంలో అవినీతి, ఉగ్రవాదాలను పూర్తిగా తరిమికొట్టడంలో విజయవంతం సాధించామన్నారు. తొలి దళిత ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య శతజయంతి రోజున ఈ పుస్తకం తెలుగులో అనువాదం కావటం ఆనందంగా ఉందన్నారు. మోదీ పరిపాలన, నాయకత్వ పటిమలపై 20 మంది ప్రముఖులు రాసిన వ్యాసాల సంకలనాన్ని తెలుగులో అనువదించటం అభినందనీయమన్నారు.

వినూత్న పాలన..

మాజీ కేంద్ర మంత్రి ప్రకాష్ జవదేకర్ మాట్లాడుతూ దేశంలో వినూత్నమైన నూతన పాలనవిధానాలతో ప్రధాని మోదీ దేశాభ్యున్నతిని పరుగులుపెట్టిస్తున్నారన్నారు. కోట్లాది మంది కుటుంబాలతో మన్‌కీబాత్ ద్వారా మాట్లాడుతున్నారన్నారు. విద్యార్థుల్లో సైతం ఆత్మవిశ్వాసాన్ని పెంచే విధంగా ప్రసంగాలు చేస్తూ నేటి తరానికి స్ఫూర్తినింపుతున్నారన్నారు.

మోదీతో దేశాభ్యున్నతి..

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఐవీఆర్ కృష్ణారావు మాట్లాడుతూ మోదీ నాయకత్వం దేశంలో అనేక అద్భుతాలు చేసిందన్నారు. దీనదయాళ్ ఆశయాలను అమలు చేస్తున్న మోదీ దేశాభ్యున్నతికి పాటుపడుతున్నారన్నారు. ప్రధానిగా మోదీ దేశచరిత్రలో సుస్థిరమైన స్థానాన్ని కైవసం చేసుకున్నారని వివరించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు, సీనియర్ జర్నలిస్టు వల్లీశ్వర్, ఎమెస్కో అధినేత డీ విజయకుమార్ పాల్గొన్నారు.

దేశంలో అసహనం పెరిగిపోతుంది

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): దేశంలో శాస్త్రీయంగా ఆలోచించాలని చెబుతుంటే అసహనం పెరిగి దాడులకు తెగబడుతున్నారని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ నన్నపనేని అంజయ్య అన్నారు. విశాలాంధ్ర పబ్లిషర్స్ ఆధ్వర్యంలో ముద్రితమైన ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆచార్యులు డాక్టర్ దేవరాజు మహారాజ్ రచించిన 'దేశంలో గౌరవనీయమైన మూర్ఖులు' మరో రచయిత ఎం. పార్థసారథి రచించిన 'నవలాలోకం' పుస్తకావిష్కరణలు 33వ విజయవాడ పుస్తక మహోత్సవం ప్రాంగణంలోని గొల్లపూడి సాహితీవేదికపై మంగళవారం రాత్రి జరిగింది. డాక్టర్ నన్నపనేని అంజయ్య మాట్లాడుతూ మనిషిని గౌరవించలేని వ్యక్తులు పశువులకు మాత్రం ఎక్కడాలేని విలువనిస్తున్నారన్నారు. విశ్వవిద్యాలయాలకు నిధులు కేటాయించమని కోరితే ఆవుపేడ కోసం పరిశోధనలంటూ పక్కదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మరో సాహితీవేత్త శ్రీనివాసరావు, బుక్ హౌస్ సంపాదకులు గడ్డం కోటేశ్వరరావు, మేనేజర్ మనోహరనాయుడు తదితరులు పాల్గొని ప్రసంగించారు.

బహుజన సాహిత్యం – నేటి అవసరంపై చర్చ

వెనుకబడిన తరగతుల సాధికారత సంస్థ ఆధ్వర్యంలో 'బహుజన సాహిత్యం – నేటి అవసరం' అంశంపై చర్చ, 24 మంది సంక్షిప్త జీవిత చరిత్రల పరిచయ కార్యక్రమాన్ని విజయవాడ పుస్తక మహోత్సవంలోని గొల్లపూడి మారుతీరావు సాహితీవేదికపై మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో సాహితీవేత్తలు బొర్రా గోవర్ధన్, వీజీఆర్ నారగోని, ఆకురాతి మురళీకృష్ణ, కృష్ణార్జున బోధి యింద్రవెల్లి రమేష్ ప్రసంగించారు.

రాంబాబును పరామర్శించిన ఐజీ త్రివిక్రమవర్మ



రాంబాబును, కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఐజీ త్రివిక్రమ వర్మ

గుంటూరుఈస్ట్: రోడ్డు ప్రమాదంలో గాయపడి జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న సైకిలిస్టును ఐజీ త్రివిక్రమవర్మ మంగళవారం పరామర్శించారు. వసంతరాయపురానికి చెందిన బండి రాంబాబు మెడికల్ రిప్రజెంటేటీవ్‌గా జీవనం సాగిస్తుంటాడు. ఆరోగ్యం కోసం నిత్యం సైకిల్ తొక్కుతుంటాడు. ఈనెల 12వ తేదీ అమరావతి రోడ్డులోని హోసన్న మందిరం వద్ద లారీ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదంలో రెండు కాళ్లు దెబ్బతిన్నాయి. సైక్లిస్ట్ అసోసియేషన్ సభ్యులు ఐజీ త్రివిక్రమవర్మ రాంబాబును పలకరించి ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైద్య అధికారులను ఏ మేరకు వైద్యం అందుతుంది అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఐజీ మాట్లాడుతూ ఈ ఘటన బాధాకరమన్నారు. ఘటనపై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని వాహనం సీజ్ చేయడం జరిగిందన్నారు. చట్టపరంగా చర్యలు తీసుకుని రాంబాబు కుటుంబానికి న్యాయం చేస్తామన్నారు. వైద్యులు సకాలంలో స్పందించి మంచి వైద్యం అందించారని ప్రశంసించారు. తాను సైక్లిస్టు అసోసియేషన్ తరుపున బాధిత కుటుంబానికి తనవంతుగా రూ.10వేలు ఆర్థిక సహాయం ఇస్తున్నట్లు తెలిపారు. సైక్లిస్టు అసోసియేషన్ సభ్యుడు బండ్లమూడి సుబ్బయ్య మాట్లాడుతూ తమ అసోసియేషన్ తరుపున రాంబాబు కుటుంబానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తున్నామన్నారు. అసోసియేషన్ సభ్యుల నుంచి చందాలు వసూలు చేసి తగిన సహాయం ఆ కుటుంబానికి అందజేస్తామని తెలిపారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ నీలం ప్రభావతి, ఆర్ఎంఓ సతీష్, వైద్య సిబ్బంది ఉన్నారు.

సైకిల్ వ్యాయామంతో క్యాన్సర్ వ్యాధి నివారణ

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ శ్రావణ్‌బాబు



ర్యాలీని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి

పెదకాకాని: ప్రతి రోజూ సైకిల్ తొక్కి వ్యాయామం చేయడం ద్వారా క్యాన్సర్ వ్యాధిని అరికట్టవచ్చని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ శ్రావణ్‌బాబు అన్నారు. ఆయుష్మాన్ భారత్ హెల్త్ మేళాలో భాగంగా సైకిల్ ఫర్ హెల్త్ పేరిట పెదకాకాని జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ప్రధానసెంటర్ మీదుగా మంగళవారం సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ శ్రావణ్‌బాబు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. పెదకాకాని పీహెచ్‌సీ వైద్యాధికారి నారాయణస్వామి అధ్యక్షత వహించారు. శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా సైకిల్ వ్యాయామంతో క్యాన్సర్ వ్యాధి తగ్గుతుందనే అంశంపై అవగాహన కల్పించే కార్యక్రమంలో భాగంగా పెదకాకాని ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో సైకిల్ ర్యాలీ నిర్వహించామని తెలిపారు. సైకిల్ వ్యాయామం ద్వారా కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించి చైతన్యపర్చనున్నట్లు తెలిపారు. సైకిల్ వ్యాయామం అలవాటు చేయడం ద్వారా మన దేశంలోనూ క్యాన్సర్ వ్యాధిని అరికట్టవచ్చన్నారు. జెడ్పీటీసీ సభ్యురాలు గోళ్ల జ్యోతి జెండా ఊపి సైకిల్ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా అధికారి జయప్రసాద్, డాక్టర్లు అన్నపూర్ణ, లక్ష్మానాయక్, జె.నారాయణస్వామి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పుట్ట దుర్గ, ఏఎస్ఎంలు, ఆరోగ్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

ఫ్యాక్టరీలలో ప్రమాదాలపై 23న మాక్ డ్రిల్

డీఆర్వో చంద్రశేఖరరావు



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో చంద్రశేఖరరావు

గుంటూరువెస్ట్: పరిశ్రమల్లో విపత్కర పరిస్థితులు ఏర్పడినప్పుడు, భారీ, అతి భారీ ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై ఈనెల 23న మాక్ డ్రిల్ నిర్వహిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖరరావు తెలిపారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో డీఆర్వో మాట్లాడుతూ మాక్ డ్రిల్ రోజునే జిల్లాలోని అన్ని పరిశ్రమల్లో దీనిని చేపట్టాలన్నారు. ముఖ్యంగా భారీ పేలుడు జరిగినప్పుడు, ప్రాణాంతక గ్యాస్ లీకైనప్పుడు, ఇతర ప్రమాదాలు ఏర్పడినప్పుడు కార్మికులకు ప్రాణనష్టం జరగకుండా చర్యలు తీసుకోవడంతోపాటు ఎలా బయటపడాలో అవగాహన కల్పించాలన్నారు. ప్రస్తుతం వేసవి ప్రారంభమయ్యిందన్నారు. ఈ నేపథ్యంలో ఫ్యాక్టరీల్లో ప్రమాదాలు జరిగే అవకాశముందని చెప్పారు. ఫ్యాక్టరీ యజమానులు కూడా సలహాలు, సూచనలు అందించడంతోపాటు వాటిని పాటించాలని చెప్పారు. సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకట శివరామిరెడ్డి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ డిప్యూటీ చీఫ్ శివకుమార్‌రెడ్డి, ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్ అస్లాం, జిల్లా అగ్నిమాపక శాఖాధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు 'బజరంగ్ నేత్రజ్యోతి'

- పోలీస్ పెరేడ్ మైదానంలో నిర్వహణ
- పోలీస్, హోం గార్డుల కుటుంబాలకు ఉచిత కంటి పరీక్షలు
- బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ మురళీకృష్ణ



అంబటి మురళీకృష్ణ

కొరిటిపాడు(గుంటూరు): పోలీసు ఉద్యోగుల కోసం బుధవారం పోలీసు పేరెడ్ మైదానంలో బజరంగ్ 'నేత్రజ్యోతి' కంటి పరీక్షల శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ తెలిపారు. స్థానిక పట్టాభిపురంలోని బజరంగ్ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బజరంగ్ ఫౌండేషన్ అమలు చేస్తున్న సంక్షేమ సేవా కార్యక్రమాల సమాహారం 2022 డిసెంబర్ మాసం 21వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవం సందర్భంగా ప్రారంభమై ఏడాది కాలంపాటు కొనసాగుతోందన్నారు. 'జగన్నామ సంక్షేమ సంవత్సరం' పేరుతో ఇప్పటికే పలు మండలాల్లోని గ్రామాల్లో సేవా కార్యక్రమాలను చేపట్టి వేలాది మంది గ్రామీణ ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా కళ్లజోళ్లను పంపిణీ చేసినట్లు తెలిపారు. బుధవారం ఉదయం 8 గంటలకు జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఆరిఫ్ హఫీజ్ శిబిరాన్ని ప్రారంభిస్తారని పేర్కొన్నారు. ఈ శిబిరం సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతోందన్నారు. సమాజ రక్షణ భద్రత కోసం అహోరాత్రులు శ్రమిస్తూ 24 గంటలు విధి నిర్వహణ చేసే పోలీసు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు, హోం గార్డులు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. పోలీసులు, హోం గార్డులు, వారి కుటుంబ సభ్యులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతేకాకుండా బజరంగ్ నారీ రుతువు కార్యక్రమంలో భాగంగా పోలీసు మహిళా ఉద్యోగులకు శానిటరీ నాప్‌కిన్ కిట్లు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



సెమీఫైనల్లో హైదరాబాద్ ఎఫ్‌సీ

ఈ సీజన్ ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్ఎల్)లో డిఫెండింగ్ చాంపియన్ హైదరాబాద్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టుకు లీగ్ దశలో రెండో స్థానంతోపాటు సెమీఫైనల్ బెర్త్ కూడా ఖరారైంది. హైదరాబాద్‌లో జరిగిన మ్యాచ్‌లో హైదరాబాద్ ఎఫ్‌సీ 1–0తో ఏటీకే మోహన్ బగాన్ జట్టుపై నెగ్గింది. ఆట 86వ నిమిషంలో ఒగ్‌బెచె గోల్ చేసి హైదరాబాద్‌ను గెలిపించాడు. 18 మ్యాచ్‌లు ఆడిన హైదరాబాద్ 39 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.

రెండో టెస్టు కోసం టీమిండియాలో శ్రేయస్

భారత క్రికెటర్ శ్రేయస్ అయ్యర్ వెన్ను నొప్పి గాయం నుంచి పూర్తిగా కోలుకున్నాడు. బీసీసీఐ వైద్య బృందం నిర్వహించిన ఫిట్‌నెస్ పరీక్షలో శ్రేయస్ పాస్ అయ్యాడని బీసీసీఐ కార్యదర్శి జై షా తెలిపారు. దాంతో శుక్రవారం నుంచి న్యూఢిల్లీలో ఆస్ట్రేలియాతో జరిగే రెండో టెస్టు కోసం అతను భారత బృందంతో కలుస్తాడు. గత డిసెంబర్‌లో బంగ్లాదేశ్‌తో చివరిసారి టెస్టుల్లో శ్రేయస్ అయ్యర్ బరిలోకి దిగాడు.



మరో విజయమే లక్ష్యంగా...

నేడు వెస్టిండీస్‌తో భారత్ పోరు

సాయంత్రం గం. 6:30 నుంచి 'స్టార్ స్పోర్ట్స్'లో ప్రత్యక్ష ప్రసారం



12 ఇప్పటి వరకు భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య 20 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు జరిగాయి. భారత్ 12 మ్యాచ్‌ల్లో, వెస్టిండీస్ 8 మ్యాచ్‌ల్లో గెలుపొందాయి. ఇక టి20 ప్రపంచకప్ చరిత్రలో రెండు జట్లు రెండుసార్లు తలపడగా...ఇరు జట్లకు ఒక్కో మ్యాచ్‌లో విజయం దక్కింది.

కేప్‌టౌన్: టి20 ప్రపంచకప్‌లో శుభారంభం చేసిన భారత మహిళల జట్టు వరుసగా మరో విజయంపై దృష్టి సారించింది. బుధవారం గ్రూప్ 'బి'లో జరిగే లీగ్ మ్యాచ్‌లో హర్మన్‌ప్రీత్ సేన... వెస్టిండీస్‌తో తలపడుతుంది. మరోవైపు ఇంగ్లండ్ చేతిలో ఓడిన కరీబియన్ అమ్మాయిలు బోణీ కొట్టేందుకు చూస్తున్నారు. చిరకాల ప్రత్యర్థి పాక్ ఎదురైన గత మ్యాచ్‌లో భారత జట్టు ఆరంభంలో తడబడినా... తర్వాత పుంజుకుంది. డాషింగ్ బ్యాటర్ స్మృతి మంధాన గాయంతో అందుబాటులో లేకపోయినా... లక్ష్యఛేదనలో భారత్ ఆడిన తీరు బాగుంది. ఇప్పుడైతే స్టార్ ఓపెనర్ స్మృతి తుది జట్టులోకి రావడంతో బ్యాటింగ్ దళం మరింత పటిష్టమైంది. గత జనవరిలో జరిగిన ముక్కోణపు సిరీస్‌లో భారత జట్టు వెస్టిండీస్‌తో తలపడిన రెండుసార్లు విజయం సాధించింది. ఓపెనింగ్‌లో షఫాలీ వర్మ, వన్‌డౌన్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ ఫామ్‌లో ఉండటంతో భారత టాపార్డర్‌కు ఏ ఢోకా లేదు. మిడిలార్డర్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్, రిచా ఘోష్‌లు కూడా బ్యాట్ ఝుళిపించగలరు. దీంతో భారీస్కోర్లు సాధించే సత్తా మన జట్టుకుంది. బౌలింగ్‌లో రేణుక సింగ్ తన పదును చూపాల్సి ఉంది. పాక్‌తో పోరులో తొలి పది ఓవర్ల పాటు బౌలర్లు చక్కగానే కట్టడి చేశారు. కానీ తర్వాతి 10 ఓవర్లే కట్టుదిట్టంగా వేయలేకపోయారు. ఈ మ్యాచ్‌లో అలాంటి తడబాటుకు అవకాశమివ్వకుండా రాణిస్తే భారత్‌కు వరుస విజయం కష్టమేం కాదు. మరోవైపు విండీస్ జట్టు వరుస వైఫల్యాలతో సతమతమవుతోంది. వరుసగా 14 మ్యాచ్‌ల్లో హేలీ మాథ్యూస్ సేన గెలుపొందలేకపోయింది. ఇందులో ఒక మ్యాచ్ 'టై'కాగా... 13 మ్యాచ్‌ల్లో ఓటమి పాలవడం జట్టును కుంగదీస్తోంది. మెగా ఈవెంట్‌లో ముందంజ వేయాలంటే కరీబియన్ జట్టుకు ప్రతీ మ్యాచ్ కీలకంగా మారింది. తొలి లీగ్ మ్యాచ్‌లో విండీస్ ఏడు వికెట్లతో ఇంగ్లండ్ చేతిలో ఓడింది.

అజహర్ ఆట ముగిసింది!

హెచ్‌సీఏ పర్యవేక్షణకు ఏకసభ్య కమిటీ • రిటైర్డ్ జడ్జి ఎల్.నాగేశ్వరరావును నియమించిన సుప్రీంకోర్టు

సాక్షి, న్యూఢిల్లీ: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్షుడిగా మొహమ్మద్ అజహరుద్దీన్ ఎట్టకేలకు తప్పుకోనున్నాడు. గత ఏడాది సెప్టెంబర్ 26నే పదవీ కాలం ముగిసినా, తనతో పాటే ఎన్నికైన అపెక్స్ కమిటీ సభ్యులను పక్కన పెట్టి మరీ అజహర్ హెచ్‌సీఏను నడిపిస్తూ వచ్చాడు. ఇప్పుడు ఆ అధికారాన్ని సుప్రీంకోర్టు తొలగించింది. ఇకపై హెచ్‌సీఏ రోజువారీ కార్యకలాపాల పర్యవేక్షణ, త్వరలోనే ఎన్నికల నిర్వహణకు కొత్తగా ఏకసభ్య కమిటీని ఎంపిక చేసింది. ఇందు కోసం సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నాగేశ్వరరావును సుప్రీంకోర్టు నియమించింది. దీంతో ఇప్పటి వరకు నలుగురు సభ్యులుగా ఉన్న పర్యవేక్షక కమిటీ కూడా రద్దయింది. ఇందులో మాజీ న్యాయమూర్తి నిసార్ అహ్మద్ కక్రూ, డీజీపీ అంజనీ కుమార్‌లతోపాటు మాజీ క్రికెటర్లు వంకా ప్రతాప్, వెంకటపతిరాజు ఉన్నారు. పేరుకే ఈ కమిటీ ఉన్నా... అన్నీ తానై అజహర్ వ్యవహరిస్తున్నాడని, సమయం ముగిసిపోయినా ఎన్నికలు నిర్వహించడం లేదని ప్రత్యర్థి వర్గం చెబుతూ వచ్చింది. ఇకపై 'అన్ని రకాల సంతకాల అధికారం' కూడా తాజాగా నియమించిన నాగేశ్వరరావుకే కట్టబెడుతున్నట్లు సుప్రీం ఉత్తర్వుల్లో ఉంది. దాంతో హెచ్‌సీఏ నుంచి అజహర్ బయటకు వెళ్లడం ఖాయమైంది.



హెచ్‌సీఏపై చార్మినార్ క్రికెట్ క్లబ్ వేసిన పిటిషన్ విచారణ సందర్భంగా సుప్రీం ఈ ఆదేశాలు జారీ చేసింది. దీనిని మంగళవారం జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, మనోజ్ మిశ్రా, జస్టిస్ అరవింద కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. ఎన్నికలు పెండింగ్‌లో ఉన్నందున ప్రతిష్టంభన తొలగించాలని, నిష్పక్షపాతంగా ఎన్నికల ప్రక్రియ జరగాలని ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు ధర్మాసనం స్పష్టం చేసింది. ఎన్నికల నిర్వహణకు జస్టిస్ ఎల్.నాగేశ్వరరావును నియమించాలని ప్రతివాదుల తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే కోర్టుకు సూచించారు. 'ప్రతిష్టంభనకు ముగింపు పలికి, నిష్పక్షపాతంగా ఎన్నికల ప్రక్రియ సాగాలని భావిస్తున్నాం. ఈ గందరగోళానికి తెర పడాలంటే సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు ఏకసభ్య నాయకత్వం తగినదని అభిప్రాయపడుతున్నాం' అని ధర్మాసనం పేర్కొంది. 'జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు హైదరాబాద్‌కు చెందిన వారు. ఎలక్టోరల్ సమస్యలు పరిష్కరించగలరు' అని తెలిపింది. జస్టిస్ ఎల్.నాగేశ్వరరావుకు అన్ని విధాలా సహకరించాలని హైదరాబాద్ క్రికెట్ సంఘాన్ని ఆదేశించింది. పూర్తి ఖర్చులు హెచ్‌సీఏనే భరించాలని కోర్టు నుంచి ఇతరత్రా ఆదేశాలు అవసరమైతే జస్టిస్ ఎల్.నాగేశ్వరరావు ధర్మాసనం దృష్టికి తీసుకురావచ్చని ఆదేశాల్లో పేర్కొంది. హెచ్‌సీఏలోని ఇతర పరిపాలనా వ్యవహారాలకు సంబంధించిన అంశాలపై తదుపరి విచారణను మార్చి 2కు వాయిదా వేసింది.



భారత సీనియర్ క్రికెటర్ చతేశ్వర్ పుజారా తన భార్య పూజతో కలిసి మంగళవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీని మర్యాదపూర్వకంగా కలిశాడు. భారత్, ఆస్ట్రేలియా జట్ల మధ్య శుక్రవారం న్యూఢిల్లీలో రెండో టెస్టు మొదలవుతుంది. పుజారా కెరీర్‌లో ఇది 100వ టెస్టు కానుంది.

భారత్ శుభారంభం


సింధు

దుబాయ్: ఆసియా మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత జట్టు శుభారంభం చేసింది. మంగళవారం గ్రూప్ 'బి' తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 5–0తో కజకిస్తాన్‌పై ఘనవిజయం సాధించింది. తొలి మ్యాచ్‌లో ఇషాన్–తనీషా ద్వయం 21–5, 21–11తో మక్సుత్–నర్గీజా జోడీపై నెగ్గింది. రెండో మ్యాచ్‌లో ప్రణయ్ 21–9, 21–11తో పనారిన్‌ను ఓడించాడు. మూడో మ్యాచ్‌లో సింధు 21–4, 21–12తో కామిలాపై నెగ్గడంతో భారత విజయం ఖరారైంది. తర్వాతి మ్యాచ్‌ల్లో గరగ కృష్ణ ప్రసాద్–విష్ణువర్ధన్ గౌడ్ 21–10, 21–6 తో కుల్మతోవ్–నియాజోవ్‌లను ఓడించగా.. పుల్లెల గాయత్రి –ట్రిసా జాలీ 21–5, 21–7తో నర్గీజా–ఐషా జుమ్‌బేక్‌లపై విజయం సాధించారు.

తొలి పోరులో ముంబైతో గుజరాత్ ఢీ

డబ్ల్యూపీఎల్ షెడ్యూల్ విడుదల

ముంబై: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) ప్రారంభ సీజన్‌కు సర్వం సిద్ధమైంది. ఐదు ఫ్రాంచైజీ జట్ల మధ్య వచ్చే నెల 4 నుంచి అమ్మాయిల మెరుపులు మొదలవుతాయి. దీనికి సంబంధించిన మొత్తం 22 మ్యాచ్‌ల పూర్తి షెడ్యూల్‌ను మంగళవారం విడుదల చేశారు. డీవై పాటిల్ స్టేడియంలో మార్చి 4న జరిగే తొలి మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్‌తో గుజరాత్ జెయింట్స్ తలపడుతుంది. ఫైనల్ 26న జరుగుతుంది. ఈ సీజన్‌లో నాలుగు రోజులు రెండేసి మ్యాచ్‌లు జరుగుతాయి. తొలి మ్యాచ్ మధ్యాహ్నం 3.30 గంటలకు, రెండో మ్యాచ్ రాత్రి 7.30 గంటలకు మొదలవుతాయి. మొత్తం 22 మ్యాచ్‌ల్లో 11 చొప్పున బ్రబౌర్న్ స్టేడియం, డీవై పాటిల్ స్టేడియాల్లో నిర్వహిస్తారు.

హైదరాబాద్‌లో ప్రైమ్ వాలీబాల్ లీగ్ సందడి



మాదాపూర్: వాలీబాల్ ప్రేమికులకు ఉత్కంఠతోపాటు ఉల్లాసాన్ని నింపేందుకు ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) రెండో సీజన్‌లో హైదరాబాద్ అంచె మ్యాచ్‌లకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం సిద్ధమైంది. నేటి నుంచి హైదరాబాద్ అంచె మ్యాచ్‌లు మొదలుకానున్నాయి. ఈనెల 21 వరకు హైదరాబాద్‌లో మ్యాచ్‌లు జరుగుతాయి. నేటి మ్యాచ్‌లో కొచ్చి బ్లూ స్పైకర్స్‌తో హైదరాబాద్ బ్లాక్ హాక్స్ జట్టు తలపడుతుంది. బెంగళూరులో తొలి అంచె మ్యాచ్‌లు ఈనెల 4 నుంచి 12 వరకు జరిగాయి.

పారిస్ ఒలింపిక్స్‌కు ఆకాశ్‌దీప్, ప్రియాంక అర్హత





రాంచీ: జాతీయ ఓపెన్ రేస్ వాకింగ్ చాంపియన్‌షిప్‌లో పురుషుల 20 కిలోమీటర్ల విభాగంలో పంజాబ్‌కు చెందిన ఆకాశ్‌దీప్ సింగ్... మహిళల 20 కిలోమీటర్ల విభాగంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ప్రియాంక గోస్వామి విజేతలుగా నిలిచారు. ఈ ఏడాది ఆగస్టులో బుడాపెస్ట్‌లో జరిగే ప్రపంచ అథ్లెటిక్స్ పోటీలకు... వచ్చే ఏడాది పారిస్ ఒలింపిక్స్ క్రీడలకు అర్హత సాధించారు. ఆకాశ్‌దీప్ 20 కిలోమీటర్ల దూరాన్ని 1 గంట 19 నిమిషాల 55 సెకన్లలో పూర్తి చేసి కొత్త జాతీయ రికార్డు సృష్టించాడు. ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్, పారిస్ ఒలింపిక్స్ అర్హత ప్రమాణ సమయాన్ని (1గం:20ని:10 సెకన్లు) అధిగమించాడు. ప్రియాంక 1 గంట 28 నిమిషాల 50 సెకన్లలో లక్ష్యానికి చేరి ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్, పారిస్ ఒలింపిక్స్ అర్హత ప్రమాణ సమయాన్ని (1గం:29ని:20 సెకన్లు) అధిగమించింది.

విండీస్‌దే టెస్టు సిరీస్

బులవాయో: జింబాబ్వే పర్యటనలో వెస్టిండీస్ జట్టు రెండు టెస్టుల సిరీస్‌ను 1–0తో కైవసం చేసుకుంది. మంగళవారం ముగిసిన ఆఖరి టెస్టులో కరీబియన్ జట్టు ఇన్నింగ్స్ 5 పరుగుల తేడాతో జయభేరి మోగించింది. ఓవర్‌నైట్ స్కోరు 290/8తో మూడో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన వెస్టిండీస్ కేవలం 2 పరుగులే జతచేసి 292 వద్ద ఆలౌటైంది. విండీస్‌కు 177 పరుగుల ఆధిక్యం లభించింది. తర్వాత రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన జింబాబ్వే 47.3 ఓవర్లలో 173 పరుగులకే కుప్పకూలింది. కెప్టెన్ క్రెయిగ్ ఇర్విన్ (72; 4 ఫోర్లు), ఓపెనర్ ఇన్నోసెంట్ కైయా (43; 7 ఫోర్లు) రాణించారు. మిగతా 9 మంది క్రీజులో నిలిచేందుకే ఆపసోపాలు పడ్డారు. తొలి ఇన్నింగ్స్‌లో 7 వికెట్లు తీసిన గుడకేశ్ మోతీ రెండో ఇన్నింగ్స్‌లోనూ 6 వికెట్లు పడగొట్టాడు. ఇక్కడే జరిగిన తొలి టెస్టు 'డ్రా'గా ముగిసింది.


మోతీ

సినిమా

జైసల్మేర్ టు మంగళూరు


• రజనీకాంత్

మంగళూరుకు షిఫ్ట్ అయ్యారు జైలర్. రజనీకాంత్ హీరోగా నెల్సన్ దిలీప్ కుమార్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'జైలర్'. శివరాజ్‌కుమార్, మోహన్‌లాల్, జాకీ ష్రాఫ్, సునీల్, రమ్యకృష్ణ, తమన్నా కీలక పాత్రలు పోషిస్తున్న చిత్రం ఇది. ఇటీవల ఈ సినిమా షూటింగ్ రాజస్థాన్‌లోని జైసల్మేర్‌లో జరిగింది. ఈ షెడ్యూల్‌లో రజనీ, మోహన్‌లాల్, జాకీ ష్రాఫ్‌ల కాంబినేషన్‌లో కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. ఇప్పుడు 'జైలర్' షూటింగ్ మంగళూరులో జరుగుతోంది. రజనీ, శివరాజ్‌కుమార్‌లపై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ చిత్రం నెక్ట్స్ షెడ్యూల్‌ను చెన్నైలో ప్లాన్ చేశారట.

ప్రత్యేక పూజలు




• పూజలు నిర్వహిస్తున్న సమంత

తమిళనాడులోని దిండిక్కల్ జిల్లాలో గల పళని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు సమంత. కొంతకాలంగా మయోసైటిస్ (కండరాలకు సంబంధించిన వ్యాధి...)తో సమంత బాధపడుతున్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ వ్యాధి నుంచి కోలుకునేందుకు సమంత వైద్య చికిత్స తీసుకుంటున్నారు. కాగా, అనారోగ్యం నుంచి వీలైనంత త్వరగా కోలుకోవాలని కోరుతూ, పళని సుబ్రహ్మణ్య స్వామి ఆలయంలో సమంత పూజలు చేశారు. అలాగే ఈ ఆలయ దర్శనానికి సమంత దాదాపు 600 మెట్లు ఎక్కి వెళ్లారని, ప్రతి మెట్టుపై ఓ కర్పూరాన్ని వెలిగించారని తెలుస్తోంది. దీనికి సంబంధించిన ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇక సినిమాల విషయానికి వస్తే... సమంత నటించిన 'శాకుంతలం' ఏప్రిల్ 14న రిలీజ్ కానుంది. శివ నిర్వాణ దర్శకత్వంలో 'ఖుషి'లో హీరోయిన్‌గా, హిందీ వెబ్ సిరీస్ 'సిటాడెల్'లో నటిస్తున్నారు సమంత.


• చంద్రబోస్, స్పీల్‌బర్గ్, కీరవాణి

ఆస్కార్ సంబరాలు ఆరంభం

ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవానికి దాదాపు నెల రోజులు ఉంది. ఈలోపు ఎప్పటిలానే ఆస్కార్ నామినేషన్ దక్కించుకున్నవారికి 'లంచ్ మీట్' ఏర్పాటు చేసింది అవార్డ్ కమిటీ. ఈ విందుకి సంగీతదర్శకుడు ఎంఎం కీరవాణి, రచయిత చంద్రబోస్ హాజరయ్యారు. 95వ ఆస్కార్ అవార్డ్స్‌లో 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో 'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు' పాటకు ఆస్కార్ నామినేషన్ దక్కిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అవార్డు కమిటీ నుంచి విందు కార్యక్రమానికి ఆహ్వానం అందగా ఈ ఇద్దరూ వెళ్లారు. ఎన్టీఆర్, రామ్‌చరణ్ హీరోలుగా రాజమౌళి దర్శకత్వంలో డీవీవీ దానయ్య 'ఆర్ఆర్ఆర్'ని నిర్మించారు. ఇక 'లంచ్ మీట్' విషయానికొస్తే..

అమెరికాలోని కాలిఫోర్నియాలో గల ది బెవర్లీ హిల్టన్ బాల్ రూమ్‌లో విందు కార్యక్రమం జరిగింది. ఈ విందులో దాదాపు 200మంది పాల్గొన్నారని సమాచారం. అక్కడ దర్శకుడు స్టీవెన్ స్పీల్‌బర్గ్‌ను కలిశారు కీరవాణి, చంద్రబోస్. ఆ ఫోటోలను చంద్రబోస్ సోషల్ మీడియాలో షేర్ చేశారు.

హుందాగా ఉందాం: జానెట్ యాంగ్

గత ఏడాది జరిగిన ఆస్కార్ అవార్డుల వేడుకకు ఓ హోస్ట్‌గా వ్యవహరించిన క్రిస్ రాక్ ఆ వేదికపై నటుడు విల్ స్మిత్ భార్య జాన్ పింకెట్ హెయిర్ స్టయిల్ గురించి కామెడీగా మాట్లాడారు. అది నచ్చక విల్ స్మిత్ అతన్ని చెంపదెబ్బ కొట్టిన విషయం గుర్తుండే ఉంటుంది. ప్రపంచం మొత్తం చూస్తున్న వేడుకలో విల్ స్మిత్ ఇలా చేయడం సరికాదని అవార్డు కమిటీ భావించింది. ఇదే విషయం గురించి తాజాగా 'లంచ్ మీట్'లో అకాడమీ చైర్మన్ జానెట్ యాంగ్ మాట్లాడుతూ – ''ఇలాంటి ఘటనలు పునరావృతం కాకూడదు. గత ఏడాది ఆస్కార్ వేడుకలో జరిగిన ఘటన (క్రిస్‌ని విల్ చెంప చెళ్లుమనిపించడం) సరైనది కాదు. అందరం బాధ్యతా యుతంగా వ్యవహరించాలి. ఇలాంటి ఘటనలను ఆస్కార్ కమిటీ ఉపేక్షించదు'' అన్నారు.


• జోనాథన్ మేజర్స్

'ఆర్ఆర్ఆర్'ని ఆస్వాదించా!

ఈ నెల 17న ఇంగ్లిష్, హిందీ, తెలుగు, తమిళ భాషల్లో విడుదల కానున్న 'యాంట్–మ్యాన్ మరియు ది వాస్ప్: క్వాంటుమేనియా'లో సూపర్ విలన్ కాంగ్ ది కాంకరర్ పాత్ర చేసిన జోనాథన్ మేజర్స్ 'ఆర్ఆర్ఆర్' గురించి మాట్లాడుతూ– ''నేను భారతీయ చిత్రానికి అభిమానిని. 'ఆర్ఆర్ఆర్'ని చాలాసార్లు చూశాను. మూడు గంటల ఈ సినిమాని ఆస్వాదించాను. ఇద్దరు నటులను (ఎన్టీఆర్, రామ్‌చరణ్) తెరపై చూడటం నాకు చాలా నచ్చింది. మరిన్ని ఇండియన్ సినిమాలు చూడాలనుకుంటున్నాను'' అన్నారు.

పోలీసాఫీసర్...


• లక్ష్మి మంచు

మంచు మోహన్‌బాబు, మంచు లక్ష్మీప్రసన్న కలిసి నటించిన తొలి చిత్రం 'అగ్ని నక్షత్రం'. వంశీకృష్ణ మళ్ల దర్శకత్వంలో లక్ష్మీ ప్రసన్న పిక్చర్స్, మంచు ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్లపై మంచు మోహన్‌బాబు, మంచు లక్ష్మీప్రసన్న నిర్మించారు. మంగళవారం ఈ సినిమా గ్లింప్స్‌ని హీరో రానా రిలీజ్ చేసి, చిత్ర యూనిట్‌కి అభినందనలు తెలిపారు. ఈ చిత్రంలో లక్ష్మీప్రసన్న పోలీసాఫీసర్ పాత్ర చేశారు. ''వైవిధ్యమైన కథాంశంతో రూపొందిన చిత్రం 'అగ్ని నక్షత్రం'. రానా విడుదల చేసిన గ్లింప్స్‌కి ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వస్తోంది. త్వరలో సినిమా రిలీజ్ డేట్ ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: అచ్చు రాజామణి, కెమెరా: గోకుల్ భారతి.

ధైర్యం కోల్పోకూడదు


• రేణూ దేశాయ్

కొన్నేళ్లుగా గుండె సంబంధిత అనారోగ్యంతో బాధపడుతున్నట్లు వెల్లడించారు నటి–దర్శకురాలు రేణూ దేశాయ్. తన అనారోగ్యం గురించి రేణు ఓ పోస్ట్‌ను సోషల్ మీడియాలో షేర్ చేశారు. ''నా అనారోగ్య సమస్యల గురించి నా సన్నిహితులకు తెలుసు. కానీ ఇప్పుడు నేనే అందరికీ చెప్పాలనుకున్నాను. ఎందుకంటే నాలాగే వివిధ రకాల అనారోగ్య సమస్యలతో ఇబ్బందిపడుతున్న వారు ధైర్యంగా ఉండాలని చెప్పడం కోసం ... వారిలో జీవితం పట్ల సానుకూలమైన ఆలోచనలను రేకెత్తించడం కోసం. మనం ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా మనలోని ధైర్యాన్ని, జీవితం పట్ల ఆశను కోల్పోకూడదు. ఎందుకంటే మన కోసం ఎన్నో స్వీట్ సర్‌ప్రైజెస్‌ను కాలం ప్లాన్ చేసి ఉండొచ్చు'' అన్నారు రేణు. ప్రస్తుతం చికిత్స చేయించుకుంటున్నానని, త్వరలోనే కోలుకుని ఆరోగ్యకరమైన జీవితాన్ని గడుపుతూ, సినిమా షూటింగ్స్‌లో పాల్గొంటాననే నమ్మకం ఉందని రేణుదేశాయ్ పేర్కొన్నారు.

జీవితగా...


• రాధిక

రక్షిత్ అట్లూరి హీరోగా, సంకీర్తనా విపిన్ హీరోయిన్‌గా నటించిన చిత్రం 'ఆపరేషన్ రావణ్'. వెంకట సత్య దర్శకత్వంలో ధ్యాన్ అట్లూరి నిర్మించిన ఈ సినిమా నిర్మాణానంతర పనులు జరుపుకుంటోంది. ఈ చిత్రంలో జీవిత పాత్ర చేస్తున్న రాధికా శరత్‌కుమార్ లుక్‌ని విడుదల చేశారు. ''స్వాతిముత్యం, స్వాతి కిరణం' లాంటి ప్రజాదరణ పొందిన చిత్రాల తర్వాత 'ఆపరేషన్ రావణ్'లో నటనకి ప్రాధాన్యం ఉన్న జీవిత పాత్ర చేశాను. తెలుగుతో పాటు తమిళంలో ఏక కాలంలో విడుదల కానున్న ఈ చిత్రంలో నటించడం సంతోషంగా ఉంది'' అన్నారు రాధిక.


• బన్నీ వాసు, కిరణ్ అబ్బవరం, కశ్మీర

అందువల్లే ఆ హీరోలు క్లిక్ అవుతున్నారు - నిర్మాత బన్నీ వాసు

''ఇండస్ట్రీలో బ్యాక్‌గ్రౌండ్ ఉన్నా లేకున్నా కష్టపడాలి. అల్లు అర్జున్, నాని, కిరణ్ అబ్బవరం, నిఖిల్‌లకు సినిమా అంటే తపన.. అందువల్లే వారు క్లిక్ అవుతున్నారు. సినిమా కోసం నిద్ర పోకుండా బాగా కష్టపడతారు'' అని నిర్మాత 'బన్నీ' వాసు అన్నారు. కిరణ్ అబ్బవరం, కశ్మీర జంటగా మురళి కిషోర్ అబ్బూరు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'వినరో భాగ్యము విష్ణు కథ'. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో 'బన్నీ' వాసు మాట్లాడుతూ– ''వినరో భాగ్యము విష్ణు కథ'లో వినోదం, ప్రేమ, థ్రిల్లింగ్.. ఇలా అన్ని వాణిజ్య అంశాలున్నాయి. ఈ చిత్రంలో సిగరెట్, మందు తాగే సీన్లు లేవు.. ఇలాంటి సినిమా చేసినందుకు గర్వంగా ఉంది. ఈ చిత్రంతో కిరణ్ అబ్బవరం కెరీర్ మరో మెట్టు పైకి ఎక్కుతుంది'' అన్నారు. ''ఈ సినిమా రషెస్ చూశాక అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందనే మా నమ్మకం రెట్టింపు అయ్యింది. నా కెరీర్‌లో గుర్తు పెట్టుకునే చిత్రం అవుతుంది'' అన్నారు కిరణ్ అబ్బవరం.


• శ్రీవిష్ణు

వేసవిలో సామజవరగమన

శ్రీవిష్ణు, రెబా మోనికా జాన్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న తాజా చిత్రం 'సామజవరగమన'. రామ్ అబ్బరాజు డైరెక్టర్. అనిల్ సుంకర సమర్పణలో ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్, హాస్య మూవీస్ బ్యానర్‌పై రాజేష్ దండా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి 'సామజవరగమన' అనే టైటిల్ ప్రకటించి, ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ''ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రం ఇది. షూటింగ్ చివరి దశలో ఉంది. ఈ ఏడాది వేసవిలో మా సినిమాని విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సహనిర్మాత: బాలాజీ గుత్తా, సంగీతం: గోపీ సుందర్, కెమెరా: రాంరెడ్డి.


• శ్రీకాంత్, మౌర్య సిద్ధవరం, శర్వానంద్

కష్టపడితే ఆదరణ లభిస్తుంది - శర్వానంద్

''మేము (నటీనటులు) ప్యాషన్‌తో, నమ్మకంతో, ఆశతో సినిమా చేస్తాం. కష్టపడి మంచి సినిమా చేస్తే ప్రేక్షకాదరణ లభిస్తుందని నేను నమ్ముతా. మంచి కథతో రూపొందిన 'హ్యాష్ ట్యాగ్ మెన్ టూ' పెద్ద సక్సెస్ కావాలి'' అని హీరో శర్వానంద్ అన్నారు. నరేష్ అగస్త్య, బ్రహ్మాజీ, హర్ష, సుదర్శన్, మౌర్య సిద్ధవరం, రియా సుమన్, ప్రియాంకా శర్మ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'హ్యాష్ ట్యాగ్ మెన్ టూ'. శ్రీకాంత్ జి. రెడ్డి దర్శకత్వంలో మౌర్య సిద్ధవరం నిర్మించారు. ఈ సినిమా టీజర్‌ను శర్వానంద్ రిలీజ్ చేసి, మాట్లాడుతూ– ''నేను, మౌర్య 'రణరంగం' సినిమాలో నటించాం. 'హ్యాష్ ట్యాగ్ మెన్ టూ' కథ నచ్చి, నిర్మించానని మౌర్య చెప్పినప్పుడు హ్యాపీగా అనిపించింది'' అన్నారు. ''నన్ను, కథని నమ్మి ఈ సినిమా నిర్మించిన మౌర్యకి థ్యాంక్స్'' అన్నారు శ్రీకాంత్ జి. రెడ్డి. ''పురుషుల బాధలను చూపించే చిత్రమిది. మహిళలకూ నచ్చు తుంది'' అన్నారు బ్రహ్మాజీ. ''యంగ్ టీమ్‌తో మంచి సినిమా చేశాను'' అన్నారు మౌర్య సిద్ధవరం.

వెళ్లిపోయే.. వెళ్లిపోయే...


• దివ్య, క్రిష్, ఆర్యన్ గౌర

ఆర్యన్ గౌర, మిస్తీ చక్రవర్తి హీరో హీరోయిన్లుగా దివ్యా భావన దర్శకత్వంలో కట్టా చందన నిర్మించిన ఫీల్ గుడ్ లవ్ స్టోరీ ఫిల్మ్ 'ఓ సాథియా'. త్వరలోనే ఈ సినిమా విడుదల కానుంది. ప్రేమికుల రోజు సందర్భంగా ఈ సినిమాలోని బ్రేకప్ సాంగ్ 'వెళ్లిపోయే పాపా వెళ్లిపోయే..'ను దర్శకుడు క్రిష్ విడుదల చేసి, సినిమా సక్సెస్ కావాలని ఆకాంక్షించారు. మ్యూజిక్ డైరెక్టర్ వినోద్‌కుమార్ (విన్ను) స్వరపరచిన ఈ పాటకు భాస్కరభట్ల సాహిత్యం అందించగా, రాహుల్ సిప్లిగంజ్ పాడారు. బాబా భాస్కర్ కొరియోగ్రఫీ చేశారు.